ఆఖరి మజిలీలో కనీస వసతులేవి ?

నిధులున్నా.. ముందుకు సాగని శ్మశానవాటిక అభివృద్ధి పనులు

అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

హఫీజ్‌పేట్: మదాపూర్ డివిజన్ పరిధిలోని కృష్ణ కాలనీ శ్మశానవాటికలో కనీస వసతులు కరువయ్యాయి. ఇటీవల ఆఖరి మజిలీలను మహాప్రస్థానాలుగా మార్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాయి. కానీ శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు కేటాయించినా.. పనులు ముందుకు సాగడం లేదు. గత కొద్ది నెలల క్రితమే చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్లు శ్మశానవాటికను సందర్శించి పరిశీలించారు. వెంటనే ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ప్రత్యేక నిధుల కింద రూ.10 లక్షలు కేటాయించారని కాలనీవాసులు చెబుతున్నారు.

◆ కాంట్రాక్టర్ అసంపూర్తిగా చుట్టూ ప్రహరీ నిర్మించి వదిలేసి వెళ్లిపోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆఖరి మజిలీకి వచ్చే ప్రజలకు కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

◆ శ్మశానవాటికలో కాలనీవాసులు ప్రధాన గేటుతో పాటు చిన్నపాటి షెడ్డు కూడా దాతల ద్వారా నిర్మించుకున్నారు. కాలనీలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ఉన్నతాధికారులు కృషి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



మదాపూర్ డివిజన్ పరిధిలోని కృష్ణకాలనీలోని శ్మశానవాటిక ఇదే..


ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


శ్మశానవాటికలో తాత్కాలిక షెడ్డు, కట్టెలతో ప్రహరీ

నెలకొన్న సమస్యలివే..

◆ శ్మశానవాటిక కోసం రూ.10లక్షల నిధులు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభం కాలేదు.

◆ ప్రహరీ లేకపోవడంతో శ్మశానవాటిక ముందే కుప్పలు తెప్పలుగా చెత్త, చెదారం ప్రజలకు కనీస వసతులు కరువయ్యాయి.

◆ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగినసా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎదురుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది.

◆ కాలనీలో డ్రైనేజీ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు.

◆ రోడ్లపైనే చెత్తచెదారం వేయడంతో దుర్గంధం వెదజల్లుతుంది. టాయిలెట్స్ నిరుపయోగంగా ఉన్నాయి.

సమస్యల పరిష్కారం కోసం..

◆ పెండింగ్‌లో ఉన్న శ్మశానవాటిక అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలి.

◆ స్నానపు గదులు, కుళాయిలు వెంటనే ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

◆ శ్మశానవాటిక చుట్టూ.. అసంపూర్తిగా ఉన్న ప్రహరీని పూర్తి చేసి, ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచెను ఏర్పాటు చేయాలి.

◆ విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్ల కోసం విడిగా స్తంభాలను ఏర్పాటు చేయాలి.

◆ రోడ్లపై వ్యర్థాలు వేయకుండా డబ్బాలు పెట్టి వాటిలోనే వేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలి.

నిధులు కేటాయించినా.. పనులు సాగడం లేదు..



కాలనీ ఏర్పడినప్పటి నుంచి నేను ఇక్కడే ఉన్నా.. కాలనీలో నెలకొన్న సమస్యలు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా. శ్మశానవాటిక అభివృద్ధికి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే రూ.10 లక్షల ప్రత్యేక నిధులు కేటాయించారు. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో అభివృద్ధి నిలిచిపోయింది. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని అభివృద్ధి పనులను పూర్తి చేయించాలి.

– కృష్ణ యాదవ్, కృష్ణ కాలనీ అధ్యక్షులు

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే అసంపూర్తి పనులు...



కృష్ణ కాలనీ శ్మశానవాటిక అభివృద్ధి పనులు కాంట్రాక్టర్ కారణంగానే అసంపూర్తిగా మారాయి. ప్రహరీ రెండు వైపుల నిర్మించి వదిలేశాడు. కనీస వసతులు కూడా ఏర్పాటు చేయకుండా వెళ్లిపోయాడు. ఆఖరి మజిలీలో ఇబ్బందులు తీవ్రంగా ఉంటున్నాయి. కనీస వసతులను కల్పించేందుకు నాయకులు కృషి చేయాలి.

– హరి, కృష్ణ కాలనీవాసి

‘ప్రజావాణి’లో వినతుల స్వీకరణ

హఫీజ్‌పేట్: చందానగర్ సర్కిల్ – 21 కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని ఉపకమిషనర్ వంశీకృష్ణ నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. మూడు వినతులు అందగా.. రెండు టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించినవిగా మరోటి యూసీడీ వసతులపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటిని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులను ఆదేశించామని చెప్పారు. ప్రజలు ఎల్లప్పుడు తమ సమస్యలను ప్రజావాణిలో వినిపించొచ్చని సూచించారు.

శేరిలింగంపల్లి సర్కిల్‌లో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి 19 దరఖాస్తులు అందాయన్నారు. వాటిలో 15 మంది అభయహస్తం కోసం దరఖాస్తు చేయగా.. టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ విభాగాలకు సంబంధించిన సమస్యలపై రెండు చొప్పున దరఖాస్తులు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, ఏఎంసీ నరేందర్‌రెడ్డి, ఉప వైద్యాధికారి నగేష్‌నాయక్, టీపీఎస్ రమేష్, ప్రాజెక్టు ఆఫీసర్ మల్లీశ్వరీ తదితరులున్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తాం

పటాన్‌చెరు: నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని బచ్చుగూడెం గ్రామంలో రూ.50 లక్షలతో చేపట్టిన అంతర్గత మురుగు నీటి కాలువలు, వీధిదీపాలు, హైమాస్ట్ లైట్లను ప్రజాప్రతినిధులతో సోమవారం కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో నియోజకవర్గంలోని మేజర్ గ్రామపంచాయతీలతో పాటు నూతన గ్రామ పంచాయతీలను సైతం అభివృద్ధి పథంలో తీసుకువెళ్లామని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లోనూ శరవేగంగా అభివృద్ధి పనులు చేపడతామని వివరించారు. సర్పంచ్ సుమతి, ఎంపీటీసీ మమత, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శేరిలింగంపల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా దూబేకాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాను మంగళవారం నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకటనారాయణరెడ్డి తెలిపారు. 11 కేవీ దూబేకాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సాంటామరియా స్కూల్, దూబేకాలనీ, రత్నదీప్ సూపర్ మార్కెట్ ఏరియా, ఆదర్శనగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నామన్నారు.

రామాలయం, తారానగర్ ఫీడర్ల పరిధిలో..

రామాలయం, తారానగర్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తారానగర్ ఏఈ సుమన్ తెలిపారు.

◆ 11కేవీ రామాలయం ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు హుడా ట్రేడ్ సెంటర్ కాలనీ, వెంకట్‌రెడ్డి కాలనీ, రైల్ విహార్‌కాలనీ, ఓల్డ్ లింగంపల్లిలో విద్యుత్ సరఫరాను నిలిపేస్తామని తెలిపారు.

◆ 11 కేవీ తారానగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వెంకటాద్రినగర్, లింగంపల్లి, పోచమ్మ టెంపుల్ ఏరియా, పీజేఆర్ స్టేడియం ఎదురుగా ఉన్న ఏరియా, శివాజీ నగర్, తారానగర్ విలేజ్, విద్యానికేతన్ స్కూల్ వెనుక ప్రాంతం, తారానగర్ మజీద్ ఏరియా, వెంకట్‌రెడ్డి కాలనీ, తెల్కార్స్ అపార్టుమెంట్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

హఫీజ్‌పేట్: వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. చెట్ల కొమ్మలను తొలగిస్తున్న కారణంగా విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

◆ ఇక్రిశాట్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంట వరకు ఇక్రిశాట్ కాలనీ, అయ్యప్పస్వామి టెంపుల్ దగ్గర, ఆర్వీ నిర్మాణ్ అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

◆ భిక్షపతి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు భిక్షపతి ఎన్‌క్లేవ్, శ్రీదేవి థియేటర్, జవహర్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ వివరించారు.

రాయదుర్గం: గచ్చిబౌలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ తెలిపారు, ఉదయం 10.30 గంటలకు మధ్యాహ్నం 1.30 గంటల నుంచి డీఎస్‌ఆర్ అపార్ట్‌మెంట్స్, జీపీఆర్‌ఏ క్వార్టర్స్, ఈపీటీఆర్‌ఐ, గచ్చిబౌలి ప్రధానరోడ్డు, గచ్చిబౌలి ఫ్లైఓవర్ ప్రాంతం, క్విట్‌లాండ్ విల్లాస్, సెంటర్‌మాల్, స్ట్రీట్ నెంబర్–1,2,3, ఇందిరానగర్, వినాయకనగర్, కేంద్రీయ విహార్ అపార్ట్‌మెంట్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ టెలికామ్‌నగర్, పీజేఆర్, ఐటీఆర్‌సీఎల్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు టెలికామ్‌నగర్, ఆర్‌టీటీసీ, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, గచ్చిబౌలి ప్రధాన రోడ్డు, హిల్ రిడ్జ్ విల్లాస్, హిల్‌రిడ్జ్ అపార్ట్‌మెంట్స్, టీమ్స్, ఎల్లాహోటల్ వంటి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ స్పష్టం చేశారు.

మియాపూర్: రాంనరేష్‌నగర్, లక్ష్మీనగర్, లెజండర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ హరీష్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఓల్డేజ్ హోమ్, మిత్ర హిల్స్, ప్రశాంత్ నగర్, జేఎస్‌రాజునగర్, బ్యాంక్ మహారాష్ట్ర, వెర్టెక్స్ ప్రైమ్ అండ్ ప్రీ విలేజ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రాంతం, డోవా కాలనీ, ఎస్‌ఎంఆర్ వినయ్ సిటీ, రత్నదీప్ సూపర్ మార్కెట్, నరేస్‌గార్డెన్, సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ఆర్‌డీబీ కోకనట్ గ్రూస్ అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎన్‌ఈపీ-2020 విజన్‌కు అనుగుణంగా శిక్షణ

రాయదుర్గం: నూతన జాతీయ విద్యావిధానం -2020 విజన్‌కు అనుగుణంగా శిక్షణా కార్యక్రమాలను ఫ్యాకల్టీ నిర్వహిస్తున్నారని యూజీసీ-ఎంఎంటీటీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సనీమ్ ఫాతిమా అన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో యూజీసీ ఎంఎంటీటీసీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా వారం రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. యూజీసీ ద్వారా నిర్వహించే ఈ కార్యక్రమం ‘అప్లికేషన్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ అండ్ జీఐఎస్ టూ ఇంజినీరింగ్ ప్రాబ్లమ్స్’ అనే అంశంపై యూజీసీ మాలవ్యమిషన్ టీచర్స్ ట్రైనింగ్ సెంటర్ (యూజీసీ-ఎంఎంటీటీసీ) పర్యవేక్షణలో ఆన్‌లైన్ ద్వారా శిక్షణను ఇస్తున్నామన్నారు. నూతన విద్యావిధానాన్ని అన్ని చోట్లా అమలు చేసేలా ప్రభుత్వం చూస్తుందని, స్పష్టమైన ఆదేశాలు కూడా ఇచ్చారన్నారు. దేశవ్యాప్తంగా 50కి పైగా ఈ శిక్షణలో పాల్గొంటున్నారని, అందులో ఉస్మానియా యూనివర్సిటీ, నిట్, పాట్నా నుంచి రిసోర్స్ పర్సన్లు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ ఢిల్లీ, అలీఘర్ ముస్లిమ్ యూనివర్సిటీలకు చెందిన వారు పాల్గొంటున్నారన్నారు. ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. యూజీసీ-ఎంఎంటీటీసీ అధికారులు పలువురు ప్రొఫెసర్లు కూడా పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత


ఎమ్మెల్యే గాంధీతో స్థానిక కాలనీవాసులు

హఫీజ్‌పేట్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. సోమవారం ఆయన నివాసంలో గోకుల్ ప్లాట్స్ కాలనీవాసులు కాలనీలో నెలకొన్న సమస్యలను వివరించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యలతో పాటు కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. త్వరలోనే కాలనీలో పర్యటిస్తానని, తన దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తానన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని, ప్రజలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రజలందరికీ అందుబాటులో ఉండి, మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని వివరించారు. కాలనీవాసులు సాంబయ్య, సంజీవరెడ్డి, శివాజీ, దుర్గారావు, ప్రకాష్‌రెడ్డి, పంతులు, హరి, దేవా, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, మనోజ్ తదితరులున్నారు.

నైపుణ్యం ఉంటేనే ఉపాధి సులువు



శిక్షణ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు, ఎస్‌ఎస్‌ఐఎస్‌టీ ప్రతినిధులు

‘ఎస్కీ’ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు

రాయదుర్గం: చదువుతోపాటు నైపుణ్యం ఉంటేనే ఉపాధి సులువుగా లభ్యమవుతుందని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వర రావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్, ఎడ్యుకేషన్ సహకారంతో ‘సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్–ఉద్యోగపాత్ర’ పై ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి కూడా చదువులో రాణిస్తూనే నైపుణ్యాభివృద్ధి కోర్సులపై శిక్షణ పొందాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచలో నైపుణ్యాలకు ఎంతో ప్రాధాన్యత ఉందని ఆయన గుర్తు చేశారు. సెంటర్ ఫర్ హ్యూమన్ సెక్యూరిటీ స్టడీస్ వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ కన్నెగంటి మాట్లాడుతూ.. పరిశ్రమకు సంబంధించిన నైపుణ్యాలతో యువతకు సాధికారత కల్పించడం అవసరమని, వారు కూడా వాటిపై ఆసక్తి చూపాలన్నారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎఫ్‌డీపీ సెల్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ నమత్ర, ఎస్‌ఎస్‌ఐఎస్‌టీ డైరెక్టర్ డాక్టర్ సివిటామి, సభ్యులు డాక్టర్ జీవీ.ప్రవీణ్, కుమారస్వామి, ఎఫ్‌డీపీ సెల్ హెడ్ సాయికిషోర్, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్కీ–ఎస్‌ఎస్‌ఐఎస్‌టీ మధ్య ఒప్పందం..

ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా–శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీల మధ్య సోమవారం గచ్చిబౌలిలోని ‘ఎస్కీ’ కార్యాలయం లో ఒప్పందం కుదిరింది, దీనిపై ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు, ఎస్‌ఎస్‌ఐఎస్‌టీ డైరెక్టర్ డాక్టర్ సివిటామీ సంతకాలు చేశారు. అనంతరం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి కల్పనలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలపై ఒప్పందం చేసుకున్నారు. ఎస్కీ, ఎస్‌ఎస్‌ఐఎస్‌టీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


గచ్చిబౌలి ఎస్కీ కార్యాలయంలో ఒప్పందం చేసుకున్న ఇరు సంస్థల ప్రతినిధులు

హోంగార్డు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి


తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో హోంగార్డుల బృందం, చైర్మన్

రాయదుర్గం: హోంగార్డుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తెలంగాణ హోంగార్డుల చైర్మన్, తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని హోంగార్డుల బృందం కలిసి విన్నవించింది. అంతకు ముందు ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం హోంగార్డులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ వెంటనే హోంగార్డుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ అశోక్, కొత్వాల్ దయానంద్,కుమారస్వామి, సైబరాబాద్ అశోక్‌కుమార్, హరిబాబు, వికారాబాద్ చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు సన్మానం

జిన్నారం(పటాన్‌చెరు): ఐదేళ్ల పదవికాలం పూర్తి చేసుకున్న సర్పంచ్‌లను ఎంపీపీ రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మెమొంటోలను బహూకరించారు. చేపట్టిన అభివృద్ధి పనులను, అనుభవాలను సర్పంచ్‌లు గుర్తు చేసుకున్నారు. ఎంపీడీఓ రాములు, ఏపీఓ సంతోష్ ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో...

మునిపల్లి(అందోల్): మునిపల్లి సర్పంచ్ రమేశ్‌ను వీరశైవ లింగాయత్ సమాజం సభ్యులు ఘనంగా సన్మానించారు.

తాండ్రకుమార్ వర్ధంతిని జయప్రదం చేయండి

మియాపూర్: ఫిబ్రవరి 14న తాండ్రకుమార్ వర్ధంతిని జయప్రదం చేయాలని ఎంసీపీఐయూ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి మైదంశెట్టి రమేష్ పిలుపునిచ్చారు. డివిజన్ పరిధిలోని స్టాలిన్‌నగర్, ఎంసీపీఐయూ కార్యాలయంలో మియాపూర్ డివిజన్ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి తాండ్రకుమార్ అని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను నిరసిస్తూ మియాపూర్‌లో రాష్ట్ర సదస్సు జరుపుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పార్టీ శ్రేణులు హాజరౌతారన్నారు. డివిజన్ కమిటీ సభ్యులు చందర్, గ్రేటర్ హైదరాబాద్ నాయకురాలు భాగ్యమ్మ, మియాపూర్ డివిజన్ కమిటీ కార్యదర్శి దశరథ్ నాయక్, డివిజన్ కార్యదర్శివర్గసభ్యులు లావణ్య, శ్రీవాణి, లలిత, నర్సింహ, అరుణ, గౌసియాబేగం, ఇషాక్, నాగభూషణం, నర్సింగ్ తదితరులున్నారు.



శిల్పారామంలో ‘నేషనల్ హ్యాండ్ లూమ్ ఎక్స్‌పో’





మాదాపూర్: వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత కళాకారులు తయారుచేసిన ఉత్పత్తులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న ‘నేషనల్ హ్యాండ్ లూమ్ ఎక్స్‌పో’ ‘గాంధీ బుణకర్ మేళా’ సందర్శకులను ఆకట్టుకుంది. కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను నగరవాసులు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. యాంఫీ థియేటర్‌లో సోమవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో నాట్య ప్రేరణ స్కూల్ ఆఫ్ ఫెర్ఫామింగ్ ఆర్ట్స్ గురువు శరత్‌గారి షియాహాయ్ బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. వినాయక కౌతం, మండూకశబ్దం, జతిస్వరం, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

పటాన్‌చెరు టౌన్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు, అమీన్‌పూర్ కౌన్సిలర్ కాటా సుధారాణి అన్నారు. సోమవారం పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామంలో జరిగిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతరలో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, ఇంద్రేశం ఉపసర్పంచ్ శివగౌడ్, రామేశ్వరం బండ వార్డుసభ్యులు నాగరాజు పాల్గొన్నారు.

తీరనున్న తరగతి గదుల కొరత

- ‘సర్వశిక్ష అభియాన్’లో వసతుల కల్పన
- శేరిలింగంపల్లి హైస్కూల్‌లో రూ.78 లక్షల వ్యయంతో 6 తరగతి గదులు
- చురుగ్గా సాగుతున్న నిర్మాణ పనులు

శేరిలింగంపల్లి: ‘సర్వశిక్షా అభియాన్’ పథకం ప్రభుత్వ పాఠశాలల పాలిట వరదాయనిగా మారింది. కనీస వసతుల కల్పనకు దోహదపడుతోంది. ఈ పథకం ద్వారా శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గదుల కొరత తీరనుంది. సర్వశిక్షా అభియాన్ కింద రూ.78 లక్షల నిధులు మంజూరు కాగా.. 6 తరగతి గదులు నిర్మిస్తున్నారు. నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. 2024–25 విద్యాసంవత్సర ఆరంభానికి ముందే ఈ తరగతి గదులు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు.

శేరిలింగంపల్లి జిల్లాపరిషత్ హైస్కూల్ వివరాలు..

◆ శేరిలింగంపల్లి మండలంలోనే అత్యంత ప్రాధాన్యత గల జెడ్పీహెచ్‌ఎస్‌గా గుర్తింపు

◆ జెడ్పీహెచ్‌ఎస్ మొత్తం విద్యార్థుల సంఖ్య 1082

◆ అందులో బాలురు 533.. బాలికలు 549, సెక్షన్లు 20

◆ ప్రస్తుతం ఉన్న తరగతి గదుల సంఖ్య 21, ఆఫీస్ రూమ్‌లు 3

◆ కొత్తగా పాఠశాల ఆవరణలో నిర్మించేవి ఆరు తరగతి గదులు


శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు దృశ్యాలు

వచ్చే సంవత్సరం అందుబాటులోకి ..

శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు రూ.78 లక్షలు మంజూరు కావడంతో ఆరు గదులు నిర్మిస్తున్నాం. ఇప్పటికే ఆయా హాల్స్ స్లాబ్ పనులు పూర్తి అయి బ్రిక్ వర్క్ కొనసాగుతుంది. వేసవి నాటికి పనులు పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరానికి అందుబాటులోకి తీసువస్తాం.

–శ్యామ్, ఏఈ

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య, ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్

శేరిలింగంపల్లి: ట్రాఫిక్ నిబంధనలను పాటించడంతోనే ప్రమాదాలు తగ్గుతాయని కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య, రామచంద్రాపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌లు తెలిపారు. సోమవారం నల్లగండ్ల హుడాకాలనీలోని సాహితీ విద్యానికేతన్ స్కూల్‌లో విద్యార్థులకు ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా విద్యార్థులు వాహనం నడిపితే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించినట్లేనన్నారు. ట్రాఫిక్‌రూల్స్‌ను విద్యార్థులు పాటిస్తూ.. వాటిని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన తర్వాతే డ్రైవింగ్ లైసెన్స్ పొందే అవకాశం ఉంటుందని, 50 సీసీ లోపు ఉన్న వాహనాలను నడిపేందుకు తల్లిదండ్రుల నుంచి ధ్రువీకరణ ఉండాలన్నారు. వాహనం నడిపే వారు హెల్మెట్ ధరించడంతో పాటు వెనుక కూర్చున్న వారు కూడా ధరించాల్సిందేనన్నారు. ఎస్సై రాములు, స్కూల్ టీచర్లు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని కార్పొరేటర్ కుమార్‌యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు కార్పొరేటర్‌కు యాదవ శ్మశానవాటికలో ప్రహరీ లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించి తన సొంత నిధులతో ప్రహరీని నిర్మిస్తానని హామీనిచ్చారు. అదేవిధంగా చైతన్యనగర్, రజక బస్తీలో విద్యుత్ స్తంబాలు, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ సమస్య, స్పీడ్ బ్రేకర్ సమస్యలు ఉన్నాయని రజక సంఘం సభ్యులు కార్పొరేటర్ కుమార్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం గొల్లబస్తీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు వెడల్పు పనులకు స్థానికుడు ఒకరు అడ్డు పడుతున్నారని తెలుసుకున్న కార్పొరేటర్ కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో కలసి సందర్శించి సమస్యను పరిష్కరించారు.

బైక్ చోరీ నిందితుడి రిమాండ్

పటాన్‌చెరు టౌన్: బైక్ చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరానికి చెందిన ఉప్పాడల రాము బతుకుదెరువు కోసం ఇస్నాపూర్‌లో వచ్చి దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఇస్నాపూర్ చౌరస్తాలో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో రామును పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా పాత నేరస్తుడిగా గుర్తించారు. ఈ నెల 9వ తేదీన ముత్తంగిలో బైక్ దొంగలించి విజయనగరంలో అమ్మివేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో పోలీసులు నిందితుడిని రిమాండ్ తరలించారు. నిందితుడు ఇటీవలే దొంగతనాల కేసులో ఆరు నెలలు జైలు శిక్షణ అనుభవించి వచ్చినట్లు పోలీసులు తెలిపారు.